# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 26-03-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **మార్కాపురం బస్సు అగ్ని ప్రమాద ఘటనలో 13 మంది మృతి.. రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ఉప రాష్ట్రపతి, ముఖ్యమంత్రి సహా పలువురు ప్రముఖుల దిగ్భ్రాంతి**

2. **మృతుల కుటుంబాలకు 2 లక్షల రూపాయల నష్ట పరిహారాన్ని ప్రకటించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ**

3. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కొనసాగుతోన్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం.**

4. **రాష్ట్రంలో క్రీడా సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని పేర్కొన్న కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్.**

==========================

మార్కాపురం జిల్లా రాయవరం వద్ద ఈరోజు జరిగిన బస్సు ప్రమాదంలో 13 మంది మృతి చెందారు. ప్రయివేట్ ట్రావెల్స్ కు చెందిన బస్సు తెలంగాణలోని జగిత్యాల నుంచి నెల్లూరు వెళుతుండగా, ఈ ఉదయం 5-6 గంటల మధ్య రాయవరం వద్ద కంకర లోడ్‌తో వెళుతున్న టిప్పర్‌ను ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బస్సు, టిప్పర్ రెండు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో మృతి చెందిన 13 మందిలో ఏడుగురు పురుషులు కాగా, నలుగురు మహిళలు, ఇద్దరు పిల్లలు ఉన్నారని అధికారులు తెలిపారు. బస్సు ప్రమాదంపై మార్కాపురం జిల్లా ఇన్ చార్జ్ ఎస్పీ హర్షవర్ధన్ రాజు పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్..30.. సెకన్లు

--------------------------

మార్కాపురం జిల్లాలో జరిగిన బస్సు అగ్ని ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బస్సు ప్రమాదంలో పలువురు సజీవదహనం కావడం అత్యంత విషాదకరమని మోదీ అన్నారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుండి మృతుల కుటుంబాలకు 2 లక్షలు, గాయపడిన వారికి 50 వేల రూపాయల చొప్పున పరిహారాన్ని ప్రకటించారు.

---------------------------

మార్కాపురం జిల్లా బస్సు అగ్ని ప్రమాదంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పలువురు ప్రయాణికులు సజీవ దహనం కావడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. గాయపడిన వారికి అందుతున్న వైద్య సాయంపై సమాచారం అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

రాయవరం వద్ద జరిగిన ప్రమాద ఘటనపై హోం మంత్రి వి. అనిత స్పందించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. సంఘటనా స్థలాన్ని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వాయిస్ ..25.. సెకన్లు

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కొనసాగుతోంది. అమరావతి సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో పలు అంశాలపై మంత్రిమండలి చర్చిస్తోంది. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలిండర్ల లభ్యత అంశాలతో పాటు పశ్చిమాసియా ఉద్రిక్తతల ద్వారా వివిధ రంగాలపై పడుతున్న ప్రభావం వంటి అంశాలపై చర్చిస్తోంది. అమరావతిలో పలు సంస్థలకు భూ కేటాయింపులు, రాష్ట్రంలో పెట్టుబడులను ప్రోత్సహించడం, అభివృద్ధి కార్యక్రమాలను అమలుపై చర్చించి ఆమోదించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో క్రీడా సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరులోని బ్రహ్మానంద రెడ్డి క్రీడా మైదానం అభివృద్ధి పనులకు కేంద్రమంత్రి ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వాయిస్..25 సెకన్లు

---------------------------

ఢిల్లీ పర్యటనలో భాగంగా వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కేంద్ర మంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, పీయూష్ గోయల్, జువల్ ఓరం ను కలిసి రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై నిన్న చర్చించారు. స్వదేశ్ దర్శన్' కింద రాష్ట్రంలోని లేపాక్షి, నిమ్మలకుంట, గండికోట, బెలూం గుహలు, అహోబిలం ప్రాంతాల పర్యాటకఅభివృద్ధికి సహకారం అందించాలని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ని కోరారు. శ్రీ సత్యసాయిజిల్లాలోని ముదిగుబ్బలో ప్లగ్-అండ్-ప్లే ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేసి ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, పులివెందుల ప్రాంతాల యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించాలని కోరారు. జిల్లాలోని

సేవాఘడ్ సందర్శించాలని, అభివృద్ధికి సహకరించాలని, అదేవిధంగా గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేలా ధర్మవరంలో 'ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్' మంజూరు చేయాలని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరంకి మంత్రి సత్యకుమార్ యాదవ్ విజ్ఞప్తి చేశారు.

-------------------------

రాష్ట్ర రాజధానిగా అమరావతి ఉండాలని శాససభలో ఏకగ్రీవ తీర్మానం చేసి, కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నామని శాసన సభాపతి సిహెచ్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, రాజధానిగా అమరావతికి పూర్తిస్థాయి చట్టబద్ధత కల్పించేందుకు ఈ నెల 28వ తేదీన శనివారం ఉదయం 11 గంటలకు శాసన సభ ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఉత్తర్వుల మేరకు ఈ సమావేశం జరగనుందని అయ్యన్నపాత్రుడు పేర్కొంటూ,

వాయిస్ ..30.. సెకన్లు

-------------------------

సామాజిక మాధ్యమాల్లో పెట్రోల్, డీజిల్ కొరతపై వస్తున్న వదంతులను ప్రజలు నమ్మవద్దని భారత పెట్రోలియం సంస్థ ఒక ప్రకటనలో సూచించింది. ఇంధన నిల్వలు తగినంతగా ఉన్నాయని, ఇంధన సరఫరా ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగుతోందని తెలిపింది. భయాందోళనలకు గురై, అవసరానికి మించి ఇంధనాన్ని కొనుగోలు చేయడం వల్ల కృత్రిమ కొరత ఏర్పడే అవకాశం ఉందని, వాహనదారులు రోజువారీ అవసరాలకు తగ్గట్లుగానే పెట్రోల్, డీజిల్‌ను కొనుగోలు చేసుకోవాలని సూచించింది.

-------------------------

రాష్ట్రంలో సహజ వాయువు వినియోగాన్ని విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగిన రాష్ట్ర స్థాయి వినియోగాల సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన నిన్న పాల్గొన్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ఇంధన సరఫరా వ్యవస్థలో ఏర్పడుతున్న అంతరాయాల దృష్ట్యా రాష్ట్రంలో ఇంధన పంపిణీ CGD వ్యవస్థపై ప్రభావాన్ని ఈ సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా సాయి ప్రసాద్ మాట్లాడుతూ, పైప్డ్ నేచురల్ గ్యాస్-PNG, కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్-CNG ఇంధన వినియోగాన్ని పెంచేందుకు సమగ్ర విధానాలు అమలు చేస్తున్నామని చెప్పారు. సహజ వాయువు మౌలిక వసతుల అభివృద్ధికి అనుమతుల ప్రక్రియను సరళీకృతం చేసినట్లు తెలిపారు.

-------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 132 వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు, మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు, నరేంద్రమోదీ యాప్‌కు రేపు సాయంకాలం వరకు పంపవచ్చు.

======================